సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 2 । జనవరి । 2023

కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి భక్తుల పూజలు



విశేష అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

సంపత్ వినాయగర్ ఆలయంలో భక్తుల రద్దీ



పూజలందుకుంటున్న సంపత్ వినాయకుడు



ఈస్ట్ పాయింట్ కాలనీలోని షిర్డీసాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజలు

కొంగొత్త ఆశలతో..

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ఆరిలోవ(విశాఖ తూర్పు): 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఆదివారం జిల్లాలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. శనివారం అర్ధరాత్రి నుంచే వేడుకలు ప్రారంభం కాగా.. ఆదివారం అంతటా సందడి నెలకొంది. యువత భాగస్వామ్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించి.. కేకులు కట్ చేసి 2023 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. అపార్ట్‌మెంట్లలో నివాసితులంతా కలసి కేకులు కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకొని సందడి చేశారు. ఆర్.కె.బీచ్, రుషికొండ, యారాడ, భీమిలి తదితర బీచ్‌లకు సందర్శకులు పోటెత్తారు. సింహగిరి, సంపత్ వినాయకుడి ఆలయం, కనకమహాలక్ష్మి ఆలయం, ఈస్ట్ పాయింట్‌కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయం, రుషికొండలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం తదితర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మసీదు, చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల కార్యాలయాలు, నివాసాల వద్ద సందడి నెలకొంది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని పెదగదిలిలోని ఆమె చాంబరులో జీవీఎంసీ అధికారులు, జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, పలు సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మల్లికార్జునను వివిధ శాఖల అధికారులు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలపడానికి వెళ్లిన నాయకులతో వారి నివాసాల వద్ద పండగ వాతావరణం నెలకొంది. ఇలా అన్ని ప్రాంతాల్లో నూతన సంవత్సరం సందడి కనిపించింది.



సందర్శకులతో కిటకిటలాడిన ఆర్.కె.బీచ్



సంగం ఆఫీసు వద్ద వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భావన



సీతంపేటలో చినమ్మలకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాసరావు



రెల్లివీధిలో జానకమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మనోజ్



జీవీఎంసీ 44వ వార్డులో సూర్యకాంతానికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నరేష్



90వ వార్డుకు చెందిన వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మి

తెల్ల తెల్ల వారే వెలుగు రేఖలా..

- పెంచిన రూ.250తో కలిపి రూ.2,750 చొప్పున అందజేత
- తొలి రోజు 70.29 శాతం పంపిణీ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైఎస్సార్ పింఛన్ కానుకను ఎప్పటిలాగే రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల చేతికి అందించింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయానికి జిల్లాలో 70.29 శాతం పంపిణీ పూర్తయింది. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ విభాగం, నగర పరిధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో బయోమెట్రిక్ గుర్తింపు ద్వారా వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 1,64,415 మందికి వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు ఉన్నాయి. వీరి కోసం ప్రభుత్వం రూ.46.17 కోట్లు కేటాయించింది. తుది సమాచారం ప్రకారం జిల్లాలో 1.13 లక్షల మందికి(70.29 శాతం) రూ.32 కోట్ల మేర పంపిణీ జరిగింది. అర్హులైన లబ్ధిదారులందరికీ ఏడు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెంచిన రూ.250తో కలిపి మొత్తం రూ.2,750 చొప్పున లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఈ నెల కొత్తగా 7,547 మందికి పింఛన్లు మంజూరు కాగా.. వారికి ఈ నెల 3వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు.

పచ్చని పొదరిల్లు.. చదువుల హరివిల్లు

- దాదాపు పూర్తి కావచ్చిన ఐఐఎం విశాఖపట్నం భవనం
- రెండు దశల్లో రూ.807.69 కోట్లతో పనులు
- 1500 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్
- 7,200 రకాల పూలు, పళ్లు, వివిధ వృక్షజాతులు పెంపకం
- ప్రస్తుతం రెండేళ్లకు కలిపి 487 సీట్లు

సాక్షి, విశాఖపట్నం : విశాఖలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) శాశ్వత భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. 241.50 ఎకరాల్లో అడుగడుగునా అద్భుతమనేలా.. గ్రీన్‌బిల్డింగ్ రూపంలో, స్మార్ట్ భవనంగా ఐఐఎం రూపుదిద్దుకుంటోంది. క్యాంపస్ పరిధిలో 7,200 రకాల పూలు, పండ్ల మొక్కలు, వివిధ వృక్షజాతులు పెంచుతున్నారు. సౌరవిద్యుత్ వినియోగిస్తూ కర్బన ఉద్గారాలను నియంత్రించేలా భవన నిర్మాణం సాగింది. పరిపాలన భవనం మినహా దాదాపు అన్ని బిల్డింగ్‌లు పూర్తి కావడంతో ఇప్పటికే తరగతుల నిర్వహణను ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరంలో మరో 100 సీట్లు అదనంగా పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రాష్ట్ర విభజన బిల్లులో పొందుపరిచిన కేంద్ర విద్యా సంస్థల్లో ఐఐఎం ఒకటి. ఆంధ్ర విశ్వ విద్యాలయం పరిధిలో 2015 నుంచి తాత్కాలిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణం కోసం ప్రభుత్వం ఆనందపురం–గంభీరం పరిసర ప్రాంతాల్లో 241.50 ఎకరాలు కేటాయించింది. ప్రస్తుతం ఈ స్థలంలో శాశ్వత భవనాల నిర్మాణం చివరి దశకు చేరుకుంది. మొదటి దశలో నిర్మాణాలకు రూ.500 కోట్ల వరకు కేటాయించారు. ప్రపంచ ప్రసిద్ధ హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని మించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ నిర్మాణాల్లో మిళితం చేయడం విశేషం.



ఐఐఎంవీ భవన సముదాయాలు

విభిన్న ప్రత్యేకతల సమాహారం

- ఇప్పటికే హాస్టళ్లు, తరగతి గదులు, 4 స్టార్ కిచెన్ తదితర నిర్మాణాలు పూర్తయ్యాయి. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. ఇది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది.
- 2022 ఆగస్టు నుంచి ఏయూ క్యాంపస్ నుంచి కొత్త క్యాంపస్‌కు తరగతులను తరలించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో భవనాల్ని అద్దెకు తీసుకుని హాస్టళ్లు నిర్వహించేవారు. వాటిని కూడా ఖాళీ చేసి.. కొత్త క్యాంపస్‌లో నిర్మించిన వసతి గృహాల్లోనే విద్యార్థులకు గదులు కేటాయించారు. ఒక్కో విద్యార్థికి ఒక్కో గదిని పూర్తిస్థాయిలో కేటాయించడం విశేషం. హాస్టళ్లను కూడా తరలించడం వల్ల అద్దెల రూపంలో నెలకు రూ.5 లక్షల వరకూ ఆదా చేస్తున్నారు.
- ఓవైపు హరిత భవనంతో వాతావరణ కాలుష్యాన్ని నివారించేలా చర్యలు తీసుకోవడంతో పాటు కర్బన ఉద్గారాల వినియోగాన్ని తగ్గించేలా క్యాంపస్ నిర్మాణం జరిగింది.
- క్యాంపస్ మొత్తానికి సౌర విద్యుత్ వినియోగించుకునేలా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. పగలు వీలైనంత మేరకు సూర్యుని వెలుతురు వినియోగించుకుంటూ.. రాత్రి సౌరవిద్యుత్ వినియోగించేలా నిర్మాణాలు చేపట్టారు. అవసరాలకు మించి విద్యుత్ ఉత్పత్తి చేసేలా 1,500 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చివరి దశకు చేరుకుంది. ఏడాదికి 22.59 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్లాంట్ నిర్మాణం జరుగుతోంది.



ప్రవేశ ద్వారం వద్ద..

- కోవిడ్ సమయంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని క్యాంపస్‌కు అదనపు హంగులు సమకూరుస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న కొన్ని పరికరాలను వినియోగించడానికి చేతులతో స్విచ్‌లు నొక్కే అవసరం లేకుండా.. సెన్సార్ల ఆధారంగా పనిచేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- హార్వర్డ్ విశ్వవిద్యాలయం నమూనాను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు 'యు' ఆకారంలో కూర్చునేలా తరగతి గదులు నిర్మించారు. 50 మంది, 100 మంది కూర్చునేలా ఏసీ తరగతి గదులు సిద్ధం చేశారు.
- వందసీట్లతో 10 తరగతి గదులు, 50 సీట్లతో 10 తరగతి గదులు నిర్మించారు. వీటికి అదనంగా మరో 5 తరగతి గదులు కూడా నిర్మించారు. ప్రొఫెసర్లకు 117 గదులున్నాయి.
- ప్రత్యేక తరగతులు చెప్పేందుకు దేశవిదేశాల నుంచి వచ్చే ప్రముఖుల కోసం 60 గదులతో ఫైవ్ స్టార్ హోటల్‌ని పోలిన అతిథి గృహం నిర్మాణం కూడా పూర్తయింది.
- ప్రతి ప్రొఫెసర్ చెప్పే పాఠం రికార్డవుతుంది. ఇలా రికార్డు చేసిన పాఠాలను ఐఐఎం వెబ్‌సైట్‌లో విద్యార్థుల కోసం రెండువారాలు ఉంచుతున్నారు. ఎవరికి ఎలాంటి సందేహం ఉన్నా.. ఈ వీడియో చూసి తెలుసుకోవచ్చు.
- విద్యార్థుల హాస్టళ్లలో ప్రతి గదిలో ఏసీ, టీవీ, ఫ్రిజ్, ఓవెన్, వాషింగ్ మిషన్ ఏర్పాటు చేశారు.
- దేశంలో ప్రత్యేక గుర్తింపు వచ్చేలా ఐఐఎం క్యాంపస్‌కు హరితహారంగా క్యాంపస్ భవనం చుట్టూ 7,200 రకాల చెట్లు, పూలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు. ఇప్పటికే కొంతమేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

సీట్లు పెంచే ఆలోచన దిశగా..

ఈ విద్యా సంవత్సరం మరో 100 సీట్లు పెంచే దిశగా ఐఐఎంవీ అడుగులు వేస్తోంది. ఇప్పటికే మొదటి సంవత్సరం విద్యార్థులు 300 మంది.. రెండో సంవత్సరం విద్యార్థులు 187 మంది ఉన్నారు. మొత్తం 487 సీట్లున్నాయి. ఈ ఏడాది మొదటి సంవత్సరం సీట్లను మరో 100కి పెంచి 400 అడ్మిషన్లు చేపట్టే దిశగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ వారం రోజుల్లో బోర్డు మీటింగ్ జరగనున్న నేపథ్యంలో సీట్ల పెంపుపై నిర్ణయం తీసుకోనున్నారు. ఏటా 100 సీట్లు పెంచుతూ మొత్తం 1170 మంది విద్యార్థుల సామర్థ్యం ఉన్న క్యాంపస్‌గా అభివృద్ధి చేయనున్నారు.

ఫైవ్ స్టార్ రేటింగ్‌కు అనుగుణంగా..



గ్రీన్ బిల్డింగ్స్ రేటింగ్ సిస్టమ్ ద్వారా 5 స్టార్ రేటింగ్ సొంతం చేసుకునేలా విశాఖపట్నంలో కొత్త ఐఐఎం క్యాంపస్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, ఇతర చిన్న చిన్న పనులు మినహా దాదాపు క్యాంపస్ పూర్తయింది. ఇందుకోసం మొత్తం రూ.807.69 కోట్లు మంజూరయ్యాయి. మొత్తం 1,170 మంది విద్యార్థులకు సరిపడా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఫస్ట్ ఫేజ్‌లో 600 మందికి వీలుగా నిర్మాణాలు చేపట్టాం. 5 స్టార్ రేటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా పచ్చదనం అభివృద్ధి చేస్తున్నాం. శాశ్వత భవనంలో త్వరలోనే పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఐఐఎంవీ డైరెక్టర్

జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా సాగుదాం



ఒక నెల జీతం విరాళంగా అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున



కలెక్టర్‌కు రూ.2,38,500 చెక్కు అందజేస్తున్న వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి వేణుగోపాల్

- అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు
- డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు ఉద్యోగుల నుంచి భారీ స్పందన

మహారాణిపేట(విశాఖ దక్షిణ): నూతన సంవత్సరంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి.. అభివృద్ధిలో జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం తనను కలిసిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.మణిరామ్ తదితరులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేక్ కట్ చేశారు.

సంజీవని నిధి–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు కలెక్టర్ నెల జీతం విరాళం

నిరుపేదలు, నిరాశ్రయుల కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో సంజీవని నిధి–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి తొలిరోజు కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉద్యోగులు భారీ మొత్తంలో విరాళాలు అందించారు. కలెక్టర్ మల్లికార్జున తన నెల జీతం రూ.1,10,000ను చెక్కు రూపంలో డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు అందించారు. కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ఉద్యోగులు రూ.12,500, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ తదితర 29 శాఖలకు చెందిన ఉద్యోగులు రూ.9,82,998 చెక్కులను కలెక్టర్‌కు అందించారు. కేవలం డీడీ, చెక్కుల రూపంలో విరాళాలు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక సందర్భాల్లో వైద్య ఖర్చులు, విద్య, పోషకాహారం తదితర అవసరాల కోసం నిరుపేదలు, నిరాశ్రయుల నుంచి కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి అర్హులైన వారికి సంజీవని–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందిస్తారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా అశోక్‌కుమార్ బాధ్యతలు



మహారాణిపేట (విశాఖ దక్షిణ): పేద రోగులకు వైద్య సేవలు ఇంకా మెరుగుపరుస్తామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ అన్నారు. సూపరింటెండెంట్‌గా ఆయన ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీహెచ్‌పై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. తాను ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశానని, 2017 – 19 కాలంలో కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేశానన్నారు. అలాగే కరోనా సమయంలో సీఎస్ఆర్ బ్లాక్ ఇన్‌చార్జిగా పనిచేయడం వల్ల ఇక్కడి పరిస్థితులపై అవగాహన ఉందన్నారు. ఆస్పత్రిలో వైద్యులు, అధికారులు," నర్సులు, మినిస్టీరియల్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది సమన్వయంతో రోగులకు మరింత సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని పేద రోగులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మౌలిక సదుపాయాలు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వైద్యులంతా కలిసి ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర కురువృద్ధుడు పీవీ ఇక లేరు

- ఉత్తరాంధ్రలో పీవీకి ప్రత్యేక గుర్తింపు
- వివాదరహితుడిగా పేరు
- బీజేపీ శ్రేణుల నివాళులు
- నగరంలో నేడు అంత్యక్రియలు

సాక్షి, విశాఖపట్నం : ఆయనో అజ్ఞాత సూరీడు.. అభినవ అల్లూరి... అలుపెరగని సేనాని.. అందరికీ ఆప్తుడు.. అజాత శత్రువు. పదవుల కంటే విలువలకే ప్రాణమిచ్చి సైద్ధాంతిక నిబద్ధతతో ప్రజాజీవితాన్ని గడిపిన మహర్షి. ఆశయ సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని, ఉపాధికి కోసం ఎంచుకొన్న న్యాయవాద వృత్తిని తృణప్రాయంగా వదిలేసి వేల మంది జీవితాల్లో వెలుగులు నింపిన కార్మిక నేత, ప్రజా సేవకుడాయన. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఆయన పేరు ఎరుగని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఆయనే భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ఆ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు పీవీ చలపతిరావు (87). గత కొంతకాలంగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం మధ్యాహ్నం కన్నుమూశారు. పార్థివదేహాన్ని పిఠాపురం కాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

అంచెలంచెలుగా ఎదిగి..

పదేళ్ల ప్రాయంలోనే ఆర్ఎస్ఎస్ భావాలు పుణికిపుచ్చుకున్న ఆయన తదనంతర కాలంలో అంచెలంచెలుగా ఎదిగారు. వివిధ ఉద్యమాలు, ఆందోళనలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, వివాదరహితుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1951లో రాయలసీమ కరువు సమయంలో అక్కడి వారి కోసం స్వయం సేవకులతో కలిసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలో నగదు, సహాయ సామగ్రి వంటివి సేకరించడం, 1950–54 మధ్య విశాఖ పరిసరాల్లోని కాలేజీలు, యూనివర్సిటీల్లో ఏబీవీపీ యూనిట్ల ఏర్పాటు, భారతీయ జనసంఘ్ కార్యకలాపాల నిర్వహణ, గోవా విముక్తి ఉద్యమంలో పాల్గొనడం వంటివి ఆయన నాయకత్వ పటిమను చాటాయి. రాజకీయాల్లోకి చేరడం కోసం తన పారిశ్రామిక విస్తరణ అధికారి ఉద్యోగాన్ని విడిచిపెట్టారు. బీఎస్సీ, బీఏ, బీఎల్ పట్టాలు పొందిన పీవీ బార్ కౌన్సిల్‌లో సామాజిక న్యాయం కోసం పనిచేశారు. 1967–68లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం, గోదావరిపై పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం న్యాయవాద వృత్తిని వదులుకుని జనసంఘ్‌కు పూర్తి స్థాయి కార్యకర్తగా మారారు. 1972–73లో ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహించినప్పుడు పలుమార్లు అరెస్టయ్యారు. ఉత్తర సర్కార్ జిల్లా గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి 1974లో ఒకసారి, 1980లో రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 1975–77 ఎమర్జెన్సీలో లోక్ సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పుడు 19 నెలలు అజ్ఞాతంలో గడిపారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి రైళ్ల నుంచి దూకడం, మారువేషాల్లో తిరగడం వంటివి ఉత్తరాంధ్రలో పీవీకి ప్రాచుర్యాన్ని తెచ్చాయి. విశాఖలోని బీహెచ్‌పీవీ, ఎంఈఎస్, డాక్‌యార్డు, ఎన్ఎస్‌టీఎల్, హెచ్‌పీసీఎల్, పోర్టు, కోరమాండల్ తదితర సంస్థల కార్మిక నాయకుడిగానూ పీవీ వ్యవహరించారు. 1980 నుంచి 1986 వరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన తనయుడు పీవీఎన్ మాధవ్ కూడా ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ల నియోజకవర్గం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.



ప్రధాని మోదీతో పీవీ(ఫైల్)

గురువుగారుగా..

సీనియర్ నేత కావడంతో బీజేపీ శ్రేణులు పలువురు చలపతిరావును గురువు గారుగా సంబోధిస్తారు. ఆ పార్టీ ముఖ్య నేతలు విశాఖ వస్తే ఆయను కలిసి, యోగక్షేమాలు తెలుసుకుని వెళ్తుంటారు. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో కొన్నేళ్లుగా పీవీ ఇంటికే పరిమితమయ్యారు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఆరిలోవలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కన్నుమూశారు. బంధువులు, పార్టీ శ్రేణులు, అభిమానుల సందర్శనార్థం పీవీ చలపతిరావు పార్థివదేహాన్ని పిఠాపురం కాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు చావులమదుం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పిఠాపురంకాలనీకి వచ్చి ఎమ్మెల్సీ మాధవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.



చలపతిరావు పార్థివ దేహం వద్ద విషణ్నవదనాలతో కుటుంబ సభ్యులు

నేడు నగరానికి గవర్నర్ల రాక

ఆరిలోవ: పీవీ చలపతిరావు మృతి విషయం తెలుసుకున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు సోమవారం విశాఖ రానున్నారు. పిఠాపురం కాలనీలో చలపతిరావు నివాసానికి చేరుకొని ఆయన పార్థివ దేహానికి నివాళులర్పిస్తారు.

నేటి నుంచి ఎస్ఏ–1 పరీక్షలు

ఆరిలోవ (విశాఖ తూర్పు): జిల్లాలో పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మెటివ్ (ఎస్ఏ–1) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల కోసం విద్యాశాఖాధికారులు జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షలు ఈనెల 2 నుంచి 10 వరకు జరగనున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఆదివారం తెలిపారు. ఈనెల 2, 3 తేదీల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వరుసగా సంస్కృతం 1,2 పేపర్లు, కంప్యూటర్ 1,2 పేపర్లకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఈనెల 4 నుంచి 7 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈనెల 4 నుంచి 10 వరకు ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు పరీక్షలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ నాన్ పీహెచ్ ఎంప్లాయిస్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ క్యాలెండర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వీవీ వామనరావు, సొసైటీ కార్యదర్శి ఎల్లయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి గుమ్మడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశం 4న

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశాన్ని ఈ నెల 4న ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సెమినార్ హాల్‌లో నిర్వహిస్తామని గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఎ.డి.పాల్ వచ్చే మూడు నెలల్లో చేపట్టబోయే ఫిల్మ్ ఫెస్టివల్‌పై చర్చించనున్నారని తెలిపారు. కొత్తగా చేరాలనుకునే వారు 9032477463లో సంప్రదించవచ్చు.

5 వరకు హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ - చెన్నై వారు నిర్వహించే పరీక్షలకు సంబంధించి రూ.10 అపరాధ రుసుంతో ఈ నెల 5 వరకు గడువు పెంచారు. ఇదే చివరి అవకాశమని భీమిలి ఆదర్శప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, రాష్ట్రభాష విశారద పూర్వార్థ, రాష్ట్రభాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్థ తదితర 9 పరీక్షలకు హాజరయ్యేవారు వివరాల కోసం 89856 47419లో సంప్రదించాలని కోరారు.

ఉత్తరద్వార దర్శనానికి వేళాయె

- నేటి ఉదయం 10 గంటల వరకు మాత్రమే అప్పన్న ఉత్తరద్వార దర్శనం
- ముస్తాబైన సింహగిరి
- విశేష ఏర్పాట్లు చేసిన దేవస్థానం



విద్యుత్ వెలుగులతో ఉత్తర రాజగోపురం

సింహాచలం: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని సింహగిరిపై వేంజేసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్తరద్వార దర్శనానికి వేళాయింది. ఆలయ ఉత్తర రాజగోపురంలో సోమవారం ఉదయం 5గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు స్వామి వైకుంఠనారాయణుడిగా శ్రీదేవి, భూదేవి సమేతుడై దర్శనమివ్వనున్నాడు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం, పోలీస్, ఆర్టీసీ, జీవీఎంసీ, విద్యుత్, ఫైర్ మెడికల్ అండ్ హెల్త్, 108 తదితర శాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనం క్యూలు, రూ.100, రూ.300 దర్శన క్యూలు, రూ.500 ప్రత్యేక దర్శన క్యూలు సిద్ధం చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదం అందజేయడంతో పాటు లక్ష లడ్డూల ప్రసాదాన్ని విక్రయానికి అందుబాటులో ఉంచారు. క్యూల్లో చిన్నారులకు పాలు, భక్తులకు మంచినీరు అందించనున్నారు. ఆలయ రాజగోపురం, ఉత్తర రాజగోపురం, ఆలయ ప్రాంగణాలకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీ ఎత్తున పుష్పాలంకరణ చేశారు. ఉదయం 4 గంటల నుంచే సింహగిరికి ఆర్టీసీ, దేవస్థానం బస్సుల రాకపోకలు ప్రారంభమవుతాయి. రాత్రి 7 గంటల వరకు మాత్రమే స్వామి వారి మూలవిరాట్ దర్శనం భక్తులకు లభిస్తుంది. భక్తులు తప్పనిసరిగా మాస్క్ ధరించి రావాలని దేవస్థానం అధికారులు సూచించారు.

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలన

ముక్కోటి ఏకాదశి ఉత్సవ ఏర్పాట్లను ఆదివారం ఉత్సవ అధికారి, దేవదాయశాఖ ఆర్‌జేసీ సురేష్‌బాబు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కోవిడ్ దృష్ట్యా క్యూల ప్రవేశంలోనే శానిటైజర్లను అందుబాటులోకి ఉంచినట్లు చెప్పారు. గాల్లో సోడియం క్లోరైట్ పిచికారీ చేస్తామన్నారు. ప్రొటోకాల్ వీఐపీలకు మాత్రమే అంతరాలయ దర్శనం ఉంటుందని, మిగతా భక్తులందరికీ నీలాద్రిగుమ్మం నుంచి లఘు దర్శనం అందిస్తామన్నారు.

బందోబస్తు విషయంపై గోపాలపట్నం సీఐ సతీష్‌కుమార్‌తో చర్చించారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా.. నూతన సంవత్సరం సందర్భంగా సింహగిరికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారందరినీ ముక్కోటి ఏకాదశికి ఏర్పాటు చేసిన క్యూల్లో దర్శనానికి పంపించి ట్రయల్‌రన్ నిర్వహించారు.

రాత్రి 11 గంటల వరకు శ్రీవారి దర్శనం



శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది(భీమిలి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి 11 గంటల వరకు సర్వదర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ఏఈవో యు.రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కాగా.. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం మూడు గంటల నుంచే ఆలయం ప్రాంగణంలో బారులుదీరారు. ఆదివారం ఒక్క రోజే 25 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. ఏఈవోతో పాటు సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు సూర్యనారాయణరాజు, శేషబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శివనాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

జోరుగా డ్వాక్రా బజార్ విక్రయాలు



వినియోగదారులతో సందడిగా డ్వాక్రా బజార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన అఖిలభారత డ్వాక్రా బజార్ సరస్-2022లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రారంభం నుంచి ప్రతి రోజు విక్రయాలు పెరుగుతున్నాయి. గత ఐదు రోజుల్లో రూ.1,03,09,407 విక్రయాలు జరిగినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎస్.శోభారాణి తెలిపారు. డ్వాక్రా బజార్‌కు విశాఖ ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులను జోరుగా విక్రయిస్తున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ బజార్ కొనసాగుతుందన్నారు.

వైభవుడి దివ్యరూపం చూతము రారండి

ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 9.30 వరకు దర్శనాలు



ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలు, ఉత్తర ద్వారం(ఇన్‌సెట్) వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్(విశాఖ ఉత్తర): కప్పరాడ ఎన్‌జీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి ఉత్తరద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 6.30 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయి. వేకువజామున 2.45గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహిస్తారు. 3.30 గంటలకు స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి.. దర్పణ దర్శనం, గోవృష్టదర్శనం, కన్యాదర్శనం కల్పిస్తారు. తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరఫున శ్రీరంగనాథుడికి 18వ పాశురం వినిపిస్తారు. 5.30 గంటలకు భూదేవి, శ్రీదేవి సమేతంగా స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారు. శేష వాహనంపై స్వామిని తోడ్కొని వచ్చి ఉత్తరద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అధిష్టింపజేస్తారు. ముందుగా ఉత్తర ద్వార నిర్మాత తిప్పల రవిశంకర్ కుటుంబ సభ్యులు, అనంతరం ఆలయం ఈవో దంపతులు, నిర్మాణ కమిటీ సభ్యులు, సంపూర్ణ సేవా భక్తులు, నిత్యపారాయణ భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. తర్వాత భక్తులకు దర్శనాలు ప్రారంభమవుతాయి.

సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక ఏర్పాట్లు

సీనియర్ సిటిజన్ల దర్శనానికి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక సమయం కేటాయించారు. వీరు తమ ఆధార్ కార్డు చూపినట్లయితే నేరుగా దర్శనాలకు పంపిస్తారు. నడవ లేని వారికి రెండు వీల్ చైర్లు అందుబాటులో ఉంటాయి. 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. సింహాచలం దేవస్థానం స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.

పకడ్బందీగా ఏర్పాట్లు



ధర్మదర్శనం, రూ.100 టికెట్‌లో శీఘ్రదర్శనం, పక్కపక్కనే పడమర వైపు ఉంటాయి. విశిష్ట దర్శనం టికెట్ రూ.500లుగా నిర్ణయించాం. ఉత్తర ద్వారం ఎదురుగా ప్రొటోకాల్ దర్శనం, తూర్పు వైపు వీవీఐపీ, వీఐపీ, శీఘ్రదర్శనం, విశిష్టదర్శనం క్యూలు ఉంటాయి. భక్తులు గమనించి ఆయా కౌంటర్ల ద్వారా దర్శనాలకు రావాలి. 300 మంది వలంటీర్లు భక్తులకు సహకారం అందిస్తారు.

– బండారు ప్రసాద్, ఆలయ ఈవో

పరమ పవిత్రం



ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకోవడం పరమపవిత్రం. ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి దర్శనం కల్పిస్తాం. నిజరూప దర్శనం ఉంటుంది. రాత్రి 9.30 గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. భక్తులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– శేషాచార్యులు, ఆలయ అర్చకులు

222 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- 1,559 మందిపై ఎంవీ నిబంధనల ఉల్లంఘన కేసులు
- నగర వ్యాప్తంగా లా అండ్ ఆర్డర్, క్రైం బీట్స్ ద్వారా తనిఖీలు



వాహన చోదకులను పరీక్షిస్తున్న పోలీసులు

అల్లిపురం (విశాఖ దక్షిణ): డిసెంబర్ 31న రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు శాంతిభద్రతలు, క్రైం, ట్రాఫిక్ విభాగాల పోలీసులు నగర వ్యాప్తంగా ముఖ్య కూడళ్లలో టెంట్లు ఏర్పాటు చేసి పికెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారిని తనిఖీలు చేసి 222 మందిపై కేసులు నమోదు చేశారు. 1,559 మందిపై ఎంవీ నిబంధనలు ఉల్లంఘన కేసులు నమోదు చేశారు. 225 వాహనాలు తనిఖీలు చేశారు. 47 మందిపై టౌన్ న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ప్రజాశాంతికి భంగం కలిగించిన 76 మందిపై కేసులు నమోదు చేశారు. దిశ యాప్ పట్ల అవగాహన కల్పించి 251 మందితో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. వాహన తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల నమోదు, విజిబుల్ పోలీసింగ్, దిశ పెట్రోలింగ్, బీచ్ సాండ్ బందోబస్తు, ట్రాఫిక్ భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

పాకుడురాళ్లు అద్భుత దృశ్య కావ్యం



పాకుడురాళ్లు నాటకంలో సన్నివేశాలు

- కళాభారతి వేదికగా దేశంలో మూడో ప్రదర్శన
- ఆకట్టుకున్న కళాకారులు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ రచించిన పాకుడురాళ్లు నవలను అద్భుత నాటకీకరణ చేసి అద్వితీయంగా ప్రదర్శించారు. 700 పేజీల నవలను రెండు గంటల నాటకంగా మలిచిన తీరు అద్భుతమని దర్శకురాలు నస్రీన్‌ను అభినందనలతో ముంచెత్తారు. నవల కథానాయిక మంగా.. మంజీరిగా మారి తీరును మలిచిన విధానం దర్శకత్వ ప్రతిభకు నిదర్శనమని కొనియాడారు. దేశంలో మూడో ప్రదర్శనగా విశాఖ కళాభారతి వేదికగా ఆదివారం పాకుడురాళ్ల నాటకాన్ని రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి సమర్పణలో ప్రదర్శించారు. కళాభారతి ఆడిటోరియం ప్రేక్షకులతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకుడురాళ్ల నవలను నాటకంగా మలిచిన తీరు అద్భుతమన్నారు. నవలను సినిమాగా తీయడం సులువు.. నాటకీకరణ చేయడం చాలా కష్టమని చెప్పారు. అలాంటి నవలను రెండు గంటల నాటకంగా చూపించడానికి దర్శకురాలు నస్రీన్ పడిన కష్టం చాలా ఎక్కువని చెప్పారు.

పాకుడురాళ్ల నాటకీకరణకు మూడేళ్లు పట్టింది

పాకుడురాళ్లు నవలను నాటకీకరణ చేయడానికి మూడున్నరేళ్లు పట్టిందని దర్శకురాలు నస్రీన్ తెలిపారు. తనకు తెలుగు రాదని, తెలుగులో ఉన్న 700 పేజీల నవలను తర్జుమా చేయానికి చాలా శ్రమించానని చెప్పారు. నాటకీకరణలో పాత్రదారులు వారి వారి కథా కథనంలో ప్రేక్షకులను లీనమయ్యేలా అభినయంతో కట్టిపడేశారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, శివశంకర్, బొలిశెట్టి సత్యారావు, కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, ప్రముఖ స్టార్ మేకర్ లంక సత్యానంద్, తదితరులు దర్శకురాలు నస్రీన్‌తో పాటు, నటి మంజరి ఇతర నటీనటులను సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



జగదాంబ జంక్షన్ మీదుగా సాగుతున్న మార్వాడీల శోభాయాత్ర

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): విశాఖ ప్రేమ్‌సాగర్ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మార్వాడీలు ఆదివారం భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. పెదవాల్తేర్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర సిరిపురం జంక్షన్, సెవెన్‌హిల్స్ ఆసుపత్రి, జడ్జికోర్టు, జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్, కురుపాం మార్కెట్ మీదుగా పాతనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల శ్యాంబాబా ఆలయం వరకు సాగింది. ప్రతి భక్తుడు జెండా చేతపట్టి శోభాయాత్రలో పాల్గొన్నారు. శ్యాంబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం జెండాలను ఆలయంపై ఎగరవేశారు. విశాఖ ప్రేమ్‌సాగర్ ట్రస్టీ సునీల్ బాలాసరియా నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు కమల్ శర్మ, కార్యదర్శి విమల్ బన్సాల్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



ఉత్తమ జట్లకు వార్షిక బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

విశాఖ స్పోర్ట్స్: విశాఖ క్రికెట్ డివిజన్లలో చక్కటి ప్రతిభ చూపిన జట్లకు, క్రికెటర్లకు వార్షిక బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. వీడీసీఏ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖలోని ఆరు డివిజన్లతో పాటు ఇన్‌స్టిట్యూషన్స్ లీగ్‌లోనూ పాల్గొన్న జట్లలో బెస్ట్‌గా ఎంపికైన వారికి బహుమలు అందజేశారు.

- ఒకటో డివిజన్ లీగ్‌లో గాజువాక గ్రీన్స్ జట్టు, గెలాక్సీ సీసీ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. గెలాక్సీ జట్టుకు చెందిన వి.శ్యామ్‌సాయి వెంకటేష్ నాలుగు మ్యాచ్‌ల్లో 333 పరుగులు చేసి బెస్ట్ బ్యాటర్‌గా.. కావలీర్స్‌సీసీకి చెందిన ఎ.మురళీ పది వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా నిలిచాడు.
- రెండో డివిజన్‌లో ఎలమంచిలి సీసీ, వైజాగ్ బ్లూస్ తొలి రెండు స్థానాల్లో నిలవగా.. శారదా సీసీ జట్టుకు చెందిన గౌరీశంకర్ మూడు మ్యాచ్‌ల్లో 178 పరుగులు చేసి బెస్ట్ బ్యాటర్‌గా.. సైమండ్‌బ్లూస్‌కి చెందిన జి.సుమిత్ 11 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా నిలిచాడు.
- మూడో డివిజన్ లీగ్‌లో శివాజీ సీసీ, గెలాక్సీ సీసీ జట్లు తొలి స్థానంలో నిలవగా... మోదమాంబ సీసీకి చెందిన పి.వి.పవన్ ఐదు మ్యాచ్‌ల్లో 297 పరుగులు చేసి బెస్ట్ బ్యాటర్‌గా.. సిటీ సీసీకి చెందిన కె.విజయ్‌కుమార్ 8 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యాడు.
- నాలుగో డివిజన్ లీగ్‌లో మెజిస్టిక్ సీసీ, విశాఖ సీసీ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. వీసీసీకి చెందిన ఎన్‌టీఆర్ కార్తీక్ ఏడు మ్యాచ్‌ల్లో 353 పరుగులు చేసి బెస్ట్ బ్యాటర్‌గా.. మూన్ స్టార్ సీసీకి చెందిన సూర్యప్రకాష్ ఆరు మ్యాచ్‌ల్లో 21 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా నిలిచాడు.
- ఐదో డివిజన్ లీగ్‌లో ఉషోదయా సీసీ, అమెచ్యూర్స్ సీసీ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. రాబిన్ సీసీకి చెందిన ఎల్.బి.సునీల్ 9 మ్యాచ్‌ల్లో 485 పరుగులు చేసి బెస్ట్ బ్యాటర్‌గా.. ఇండియా స్టార్స్ సీసీకి చెందిన వి.సుబ్రహ్మణ్యస్వామి 9 మ్యాచ్‌ల్లో 25 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యాడు.
- ఆరో డివిజన్ లీగ్‌లో రైజింగ్ బ్లూస్ సీసీ, పీఎంపాలెం సీసీ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఆశ్రయ సీసీకి చెందిన హనీఫ్ ఆరు మ్యాచ్‌ల్లో 430 పరుగులు చేసి బెస్ట్ బ్యాటర్‌గా.. వాల్తేర్ నైట్స్ సీసీకి చెందిన టి.బాబులు 19 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యాడు.
- ఇన్‌స్టిట్యూషన్స్ లీగ్‌లో సిటీ పోలీస్ జట్టు, గ్రేహౌండ్స్ జట్టు తొలి రెండు స్థానాలు దక్కించుకున్నాయి. సిటీ పోలీస్‌కి చెందిన వి.త్రినాథ్ తొమ్మిది మ్యాచ్‌ల్లో 559 పరుగులు చేసి బెస్ట్ బ్యాటర్‌గా.. వీపీఎస్‌సీకి చెందిన వి.వి.రమణ 17 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా నిలిచాడు.

వార్షిక బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఏసీఏ సీఈవో ఎం.వి.శివారెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీఏ అధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, కార్యదర్శి పార్థసారథి, ఉపాధ్యక్షులు డి.ఎస్.వర్మ, టి.ఎస్.ఆర్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి జె.కె.ఎం.రాజు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ స్పందన

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం జరగనుంది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరించనున్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,200
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.50,600
వెండి(కిలో):	రూ.74,300

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	552.00
విజయనగరం	556.00
శ్రీకాకుళం	556.00